

చన్నసంద్రలో భారీ ఉద్యోగమేళా

మహదేవపుర, జూలై 27: నియోజకవర్గంలోని చన్నసంద్ర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శనివారం భారీ ఉద్యోగ మేళాను మాజీ మంత్రి అరవింద లింబావళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ని యోజక వర్గంలో ఐదో మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రైవేట్ సంస్థల్లో యు వతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మేళాను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మేళాలో 70 కంపెనీలు పాల్గొనగా సుమారు 2వేల మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ముఖ్యులు శెట్టి, మనోహరరెడ్డి, నటరాజ్, పాపణ్ణ, రాజేశ్, మహేంద్రమోది, హరాడి పిళ్ళప్ప, చన్నసంద్ర చంద్రశేఖర్ పాల్గొన్నారు

ప్రకృతిపై దాడికి గుణపాఠాలు

విరిగిపడుతున్న కొండచరియలు



శిరూరు వద్ద మట్టి చరియలు విరిగిపడిన ప్రదేశం

- రాష్ట్రంలో ఏడు జిల్లాలవాసులకు ప్రాణసంకటం
- 2018లో అత్యధికంగా 26 మంది దుర్మరణం
- శిరూరు ఘటనలో ఇంకా కొనసాగుతున్న సహాయక చర్యలు
- శాశ్వత చర్యలపై దృష్టిపెట్టని పాలకులు



సహాయక చర్యలు ఇలా...

బెంగళూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భిన్నమైన ప్రకృతి వనరులు ఉన్నాయి. మూడు జిల్లాలకు అనుబంధంగా సముద్రతీరం ఉంది. పశ్చిమ కనుమలలో అవసరాల పేరిట ప్రకృతిపై దాడి సాగుతున్న పరిణామం ఏటా వర్షాకాలం వస్తే చాలు కొండచరియలు విరిగిపడతాయనే భయం ఏకంగా ఏడు జిల్లాల ప్రజలను వెంటాడుతోంది. హిమాలయాల కంటే పురాతనమైన సహ్యాద్రి కొండలు, ప్రకృతి సంపదతోపాటు నదుల మూలాలు, అపారమైన అటవీ ప్రాంతం, జీవవైవిధ్యంతోపాటు కోట్లాది ప్రజలకు జీవనాడిగా పశ్చిమ కనుమలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డం సాధారణంగా మారిపోయింది. రాష్ట్రంలో తీవ్రమైన సమస్యల్లో కొండచరియలు ప్రమాదం కూడా ఒకటిగా ఉంది. ఏడు జిల్లాల పరిధిలోని 30 తాలూకాల్లో ఏటా వర్షాకాలం భూమి కుంచించుకుపోయే పరిస్థితి ఉంటోంది. భూమి కుంచించుకుపోతున్న సంఘటనలపై పలు అధ్యయనాలు, నివేదికలు రూపొందించాయి. ఇటువంటి సంఘటనలు ఎందుకు కొనసాగుతున్నాయో స్పష్టమైన ఆధారాలతో ప్రత్యామ్నాయ పరిష్కారాలను ప్రభుత్వానికి వివరించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రమాదాలు సంభవించినప్పుడు రక్షణా చర్యలు కొనసాగించడం, బాధితులకు కొంత పరిహారం ఇవ్వడానికి పరిమితమయ్యాయి. కానీ భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుడా శాశ్వతమైన చర్యలు చేపట్టడం లేదు. వర్షాకాలం ప్రారంభమైందంటే చాలు, భూమి కుంచించుకుపయే ఘటనలు కొనసాగుతుంటాయి. వర్షాకాలం ముగిశాక ప్రభుత్వం, ప్రజల మనసు నుంచి కూడా ఈ అంశం దూరమైపోతోంది. ఉత్తరకన్నడ జిల్లా కారవార సమీపంలోని కడవాడలో 2009లో భూమి కుంచించుకుపోయిన సంఘటనే ఈ శతాబ్దపు అతిపెద్ద ప్రమాదంగా ఉంది. ఆ తర్వాత కొండగుట్టలు కుంగిపోతున్నాయి. 2016 తర్వాత ప్రమాదాలసంఖ్య పెరుగుతూనే వస్తోంది. 2018లో కొడగు జిల్లా మడికేరి ప్రాంతంలో కొండచరియలు కుశించుకుని పోయిన సంఘటన రాష్ట్ర ప్రజలను బెంబేలెత్తించింది. ప్రమాదంలో కనుమరుగైన కావేరి తీర్థోద్భవం తలకావేరి ఆలయ అర్చకుడి ఆచూకీ లభించనేలేదు. ఆ ఏడాది కొడగులో సాధారణ వర్షం కంటే 32శాతం అత్యధికంగా పోటెత్తడమే కారణమైంది. జిల్లాలో భారీ వరద కొనసాగింది. కొడగులో అత్యధికంగా భూమి కుంచించుకుపోయిన ప్రమాదాలు అదే ఏడాది జరిగాయి. నేషనల్ జియోగ్రఫీ సర్వే సంస్థ 105 భూమి కుంగిన ఘటనలు చోటు చేసుకున్నాయని 20 మంది మృతి చెందగా, 268 పశువులు గల్లంతు అయ్యాయని, 33,548 మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయని పేర్కొంది. 18వేల మంది కోసం 45 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం కొండచరియలు విరిగిపడకుండా తీసుకోవాల్సిన చర్యల అధ్యయనం కోసం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సమితి 2021లో పశ్చిమకనుమలు, తీరప్రాంతాల్లో భూమి కుంచించుకుపోయే ప్రమాదాల నియంత్రణకు మార్గదర్శకాలు పేరిట ఓ ప్రత్యేక నివేదికను సిద్ధం చేసింది. కర్ణాటక విపత్తు నిర్వహణా ప్రాధికార 2022లో ఓ క్రియాశీలకమైన కార్యాచరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించింది. ఎక్కువ వర్షం కురిసే ప్రాంతాల్లో కొండచరియలు పడే ప్రాంతాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయడం, అడ్డుగోడలు నిర్మించడం అక్కడ నివసించేవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పలుశాఖల సమన్వయంతో అత్యవసర చర్యలు చేపట్టడం వంటి సలహాలు ప్రస్తావించింది. రెండు కమిటీలు ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రస్తుతం కొనసాగుతున్న సంఘటనలకు మానవాళి తప్పిదాలుగా స్పష్టం చేశారు. అక్రమంగా నిర్మాణాలు, అటవీ ప్రాంతాన్ని నాశనం చేయడం, అక్రమ గనుల తవ్వకాలు, రోడ్లు తదితర నిర్మాణాలకు కొండగుట్టలను ఇష్టం వచ్చినట్టు తవ్వడం, ప్రకృతిపై దాడి తీవ్రమైతేనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటాయని అభిప్రాయపడుతున్నారు.

ప్రమాదాల జిల్లాలు ఇవే..

రాష్ట్రంలో ఏడు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదాలు ఉన్నాయి. వీటిలో ఉత్తరకన్నడ జిల్లా పరిధిలో అంకోలా, హొన్నావర, కారవార, కుమట, సిద్ధాపుర, శిరసి, జోయిడా, ఎల్లాపుర, భట్కళ్ తాలూకాలు ఉండగా శివమొగ్గ జిల్లాలో హొసనగర, సాగర, తీర్థహళ్లి తాలూకాలు, ఉడుపి జిల్లాలో హెబ్రి, బైందూరు, కార్కళ, కుందాపుర తాలూకాలు, చిక్కమగళూరు జిల్లాలోని మూడగిరి చిక్కమగళూరు, నరసింహరాజపుర, శృంగేరి, దక్షిణకన్నడ జిల్లాలో బెళ్తంగడి, బంట్వాళ, మంగళూరు, కడబ, సుళ్య, పుత్తూరు తాలూకాలు, కొడగు జిల్లాలో మడికేరి, సోమవారపేట, విరాజ్‌పేట తాలూకాలు, హాసన్ జిల్లాలో సకలేశపుర తాలూకాలు ఉన్నాయి. ఏడు జిల్లాల్లో 30 తాలూకాలలో 250 గ్రామపంచాయతీల పరిధిలో 1351 గ్రామాలలో ప్రమాద కేంద్రాలుగా ఉన్నాయి. భూమి కుంచించుకుపోయే సంఘటనలతో 15.30 శాతం మేర రాష్ట్ర భూభాగ ప్రమాణంలో ఉంది. 9,350 చదరపు కిలోమీటర్లు ప్రమాద భూభాగంగా ఉంది. 2016లో 125 ప్రమాదాలు చోటు చేసుకోగా 2017లో 219 ప్రమాదాలు, 2018లో 462 ప్రమాదాలు చోటు చేసుకోగా 26 మంది మృతి చెందారు. 2019లో 161 ప్రమాదాలు జరగ్గా 10 మంది మృతి చెందారు. 2020లో 264 ప్రమాదాలల్లో ఏడుగురు మృతి చెందారు. 2021లో 66 ప్రమాదాలు చోటుచేసుకోగా ఒకరు మృతి చెందారు. ఇటీవల ఉత్తరకన్నడ జిల్లా శిరూరు వద్ద భూమి కుంచించుకుపోవడంతో 11మంది మృతి చెందారు. 2009 నుంచి 2021 వరకు పరిశీలిస్తే ఉత్తరకన్నడలో అత్యధికంగా 439, శివమొగ్గలో 356, చిక్కమగళూరులో 193, ఉడుపిలో 99, దక్షిణకన్నడలో 88, కొడగులో 79, హాసన్‌లో 18 సంఘటనలు చోటు చేసుకున్నాయి.

నియంత్రణ చర్యలు

భూమి కుంచించుకుపోయే ప్రదేశాల గ్రామస్థాయిలో బ్లూప్రింట్ తయారు చేయడం, సూక్ష్మప్రదేశాలలో గనుల తవ్వకాలు నిలివేయడం, క్వారీ చర్యలు రద్దు చేయడం, అటవీభూమి సంరక్షణ, సరిహద్దులలో చెట్లను పెంచడం, శాస్త్రీయం లేని అభివృద్ధి పనులను నియంత్రించడం, నీరు ప్రవహించే ప్రాంతాలను అడ్డంకులు ఏర్పాటు చేయడం వంటి చర్యలతోనే భూమి కుంచించుకుపోయే ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరకన్నడ జిల్లా శిరూరు ప్రదేశంలో భూమి కుంచించుకుపోయే ప్రమాదం ఉందని మూడు నెలల ముందే శాస్త్రవేత్తలు హెచ్చరించారు. కారవార - గోవా జాతీయ రహదారి నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న కేంద్ర అటవీ, హైవే అధికారులు హెచ్చరించారు. ఈప్రాంతంలో ప్రమాదాలు ఉంటాయని 2021లో నివేదికలు ఇచ్చినా పనులు కొనసాగించారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖ జియాలజిస్ట్ శ్రీనివాసరెడ్డి అభిప్రాయం మేరకు గతంలో భూమి కుంచించుకుపోవడం ప్రకృతి విపత్తుగా ఉండేదని, ఇటీవలి కాలంలో తీరప్రాంతం, పశ్చిమకనుల ప్రాంతాల్లో రోడ్డు, విద్యుత్‌లైన్ ఏర్పాటు, గనుల తవ్వకాలు వంటివి కొనసాగినందున ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

రాష్ట్రంలో నాలుగు విమానాశ్రయాల పేర్ల మార్పు..?

బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు విమానాశ్రయాల పేర్లు మార్చేందుకు ప్రభుత్వం కసరత్తు సాగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పౌర విమానయానశాఖ కార్యాలయానికి సిఫారసు చేసింది. వీటిలో విజయపుర, హుబ్బళ్లి, బెళగావి, శివమొగ్గ విమానాశ్రయాలు ఉన్నాయి. విజయపుర విమానాశ్రయానికి జగజ్యోతి బసవేశ్వర ఎయిర్‌పోర్ట్, హుబ్బళ్లిలో క్రాంతివీర సంగొళ్లిరాయణ్ణ పేరు, బెళగావికి కిత్తూరు రాణి చెన్నమ్మ పేరు, శివమొగ్గకు జాతీయ కవి కువెంపు పేరు పెట్టాలని ప్రతిపాదనలు పంపారు. లోక్‌సభలో ఇటీవల విమానయాన సహాయమంత్రి మురళీధర్ మొహల్ ఓ ప్రశ్నకు సమాధానంగా పది విమానాశ్రయాలకు పేర్లు మార్చాలనే ప్రతిపాదనలు వచ్చాయని ప్రకటించారు. ఇందులో రాష్ట్రానికి సంబంధించిన నాలుగు విమానాశ్రయాలు ఉన్నట్టు తెలుస్తోంది. సాధారణంగా ఎయిర్‌పోర్ట్ నగరం పేరుతోనూ, లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన పేరును నిర్ధారిస్తుంది. అందుకు సంబంధించి శాసనసభలో ఆమోదింపచేస్తారు. సదరు సిఫారసులను కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ ద్వారా కేంద్ర కేబినెట్‌లో ఆమోదానికి తీసుకొస్తారు. ప్రస్తుతానికి సిఫారసు మాత్రమే చేసినా బెళగావిలో నవంబరు లేదా డిసెంబరులో బెళగావిలో జరిగే శీతాకాల సమావేశాలలో అంగీకారం తెలిపేందుకు ప్రతిపాదనలు పెట్టదలిచారు. నాలుగు విమానాశ్రయాల్లో హుబ్బళ్లి, బెళగావి ఎయిర్‌పోర్ట్‌లను కేంద్ర విమానయాన అథారిటీ పర్యవేక్షిస్తుండగా శివమొగ్గ, విజయపుర విమానాశ్రయాలను గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌లుగా ఉన్నాయి. గత ఏడాది ప్రారంభమైన శివమొగ్గ ఎయిర్‌పోర్ట్‌ను రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ నిర్వహిస్తోంది. విజయపుర విమానాశ్రయంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం కాలేదు.



బెళగావి ఎయిర్‌పోర్ట్

రైళ్ల ద్వారా మాంసం సరఫరా

- అడ్డుకున్న హిందూ సంఘాలు
- కుక్కల మాంసం అంటూ ఆరోపణలు
- పరిశీలిస్తున్నామన్న అధికారులు


బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న మాంసంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో కిలో మాంసం రూ.750గా ఉండగా మెజస్టిక్ ప్రాంతంలో కిలో రూ.450కే విక్రయించడంపై అనుమానాలు నెలకొన్నాయి. రాజస్థాన్ నుంచి భారీ స్థాయిలో మాంసం దిగుమతి అవుతుండడంపై హిందూ సంఘాలు అభ్యంతరం తెలిపాయి. శుక్రవారం రాజస్థాన్ నుంచి ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా వచ్చిన మాంసం పార్సిల్స్‌ను హిందూ సంఘాల కార్యకర్తలు అడ్డుకున్నారు. వారానికి రాజస్థాన్ నుంచి 12వేల కిలోల మటన్ బెంగళూరుకు రవాణా అవుతున్నట్టు గుర్తించారు. నగరానికి చెందిన అబ్దుల్‌రజాక్ అనే వ్యక్తి రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి మాంసాన్ని దిగుమతి చేసుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లోని హోటళ్లు, దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. రైలు నుంచి తీసుకొస్తున్న మాంసం బాక్సులను హిందూ కార్యకర్త పునీత్ కెరెహళ్లి అడ్డుకుని ఇందులో ఏ మాంసం ఉందని ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రాజస్థాన్ నుంచి కుక్కల మాంసాన్ని తీసుకొచ్చి విక్రయిస్తున్నారంటూ కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. సమయానికి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అడ్డుకున్న వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాసేపటికే అతను ఒక్కసారిగా కుప్పకూలడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కేసీ జనరల్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు జరిపించి విక్టోరియా ఆసుపత్రిలో చేర్చారు. వివాదం తీవ్రమవడంతో బీబీఎంపీ అధికారులు రంగంలోకి దిగారు. ఆహారశాఖ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాంసం వ్యాపారి అబ్దుల్‌రజాక్‌కు లైసెన్స్ లేదని తెలిపారు. ప్రస్తుతానికి 12 మందికి మాత్రమే లైసెన్సులు ఉన్నాయని, వారిని పిలిపించి విచారణ చేస్తామన్నారు. కుక్కల మాంసం ఉన్నట్టు హిందూ సంఘం నేత పునీత్ కెరెహళ్లి ఆరోపణలను తీవ్రంగా పరిగణించామని, నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. పునీత్ కెరెహళ్లి పోలీసుల విధులను అడ్డుకున్నందుకే స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. కుక్కల మాంసం విక్రయిస్తున్నారనే ఆరోపణలు నగరంలో హల్‌చల్ చేశాయి.



పునీత్ ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం
మాంసం బాక్సుల డంపింగ్

తుంగభద్ర ఉగ్రరూపం

- నీట మునిగిన ఆలయాలు
- అరటి పంటల్లో చేరిన నీరు
- కంప్లికోట ప్రాంతం జలమయం.. జనం అవస్థలు




కంప్లి కోట వద్ద మునిగిన వంతెన

కంప్లి, జూలై 27 : తుంగభద్ర ఉగ్రరూపం దాల్చుతోంది. జలాశయం నుంచి నదికి భారీగా నీరు పోటెత్తింది. 33 గేట్లు ఎత్తి లక్షా 50 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయం భర్తీ కావడంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగానే నదికి విడుదల చేస్తున్నారు. రెవెన్యూ శాఖ, పోలీలు, ఆరోగ్యశాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు నది ఒడ్డున ఉన్న ప్రాంతంలో అప్రమత్తంగా వుండాలంటూ ప్రజలను హెచ్చరిస్తున్నారు. హంపిలో కోదండరామ ఆలయంలోకి నీరు ప్రవహించింది. కోదండరామ ఆలయం, యంత్రోత్పాదక వద్దకు జనం వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. శనివారం విజయనగర జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ నదిని పరిశీలించారు. పర్యాటకులు నది ఒడ్డుకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కంప్లిలో వంతెన పూర్తిగా మునిగిపోయింది. పక్కనే వున్న అరటితోటల్లోకి నీరు చేరింది. కంప్లి కోటలో కొంతవరకు జలమయం కావడంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నీటిలోనే సంచారం చేపడుతున్నారు. అక్కడ తహసీల్దార్ శివరాజు, నోడల్ అధికారి దుర్గన్న, ఎలాంటి సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు చేపట్టారు. కోట ఆంజనేయస్వామి ఆలయం కూడా మునిగిపోయింది. నదీ తీరాన వుండే రైతన్నలు మోటార్లను గట్టుకు చేర్చారు. సన్నాపురం వద్ద ఇటిగి, సన్నాపురం మధ్య రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ప్రవాహం ఎక్కువ కావడంతో నదిలో నీరు వాగుకు పోటెత్తి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోజురోజుకు నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో పలుచోట్ల గంజి కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు.



నీటమునిగిన కంప్లి కోట ఆంజనేయస్వామి ఆలయం




నీటి ప్రవాహంతో సన్నాపురం - ఇటిగి మధ్య నిలిచిన రాకపోకలు



గట్టుకు చేరిన మోటార్లు



హంపిలో నది ఒడ్డున అధికారులతో చర్చిస్తున్న జిల్లా అధికారి



కోదండరామాలయంలోకి చేరిన నీరు



నదికి అడ్డంగా హంపిలో బారికేడ్లు పెట్టిన దృశ్యం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.68	1,615.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,03,676	1,11,566
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,17,571	107
సామర్థ్యం (టీఎంసీలు)	100.52	49.76

పచ్చరంగేసుకున్న వరిపొలాలు

● నారు మడులకు పెరిగిన డిమాండ్ ●పనిపాటల్లో జనం బిజీ..బిజీ

బళ్లారి సిటీ,జూలై 27: తుంగభద్ర డ్యాం నుంచి కాలువలకు నీరు వదలడంతో నదీతీరంలోని పొలాలన్నీ పచ్చరంగులోకి మారుతున్నాయి. బళ్లారి, విజయనగరం, జిల్లాలోని సూగూరు, మన్నూర్, నడివి, రుద్రపాడు, నిట్టూరు, కెంచనగుడ్డ గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. నెల రోజుల క్రితం పంపుసెట్ల ద్వారా నారు పోసి పెంచిన రైతులకు నదికి నీరు వస్తున్న నేపథ్యంలో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒక సెంటు మొలక రూ.1500 వంతున విక్రయిస్తున్నారు. ఎకరానికి 2సెంట్ల నారు అవసరం. కూలీపనులు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే 6వేల ఎకరాలలో వరి నాట్లు పూర్తికాగా మిగిలిన రైతులు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈసారి జూలై 20న కాలువకు నీటిని విడుదల చేశారు. రైతులు భూమిని సిద్ధం చేసుకుని వరి నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. తాలూకాలో 60,735 హెక్టార్ల భూమి అందుబాటులో ఉండగా, ఇందులో 40.686 హెక్టార్లలో ఆయకట్టు కింద, 20,049 హెక్టార్లలో వర్షాధారం కింద పంటలు వేయాల్సి ఉంది. మిగిలిన భూమిలో పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, సజ్జ, కొర్రలు, మిర్చి, పత్తి, చెరకు ఇతర పంటలు విత్తుతున్నారు. ఇప్పటికే 83శాతం నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. తాలూకా అంతటా తుంగభద్ర అచ్చుకట్టు విభాగంలో వరి ఎక్కువగా పండుతుంది. ఈఏడాది 35.142హెక్టార్లలో వరి నాట్లు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నదీతీర గ్రామాల రైతులు ఇప్పటికే పంపుసెట్ల కింద వరి పంట వేశారు.



వరినాట్లలో నిమగ్నమైన కూలీలు

బంగ్లాదేశ్ విద్యార్థులకు మద్దతుగా నిరసన



నగరంలో నిరసన తెలుపుతున్న ఏఐడీఎస్ఓ

బళ్లారి సిటీ, జూలై 27: అనేకరోజులుగా పోరాటం చేస్తున్న విద్యార్థులపై బంగ్లాదేశ్ ప్రభుత్వం పైశాచిక దాడిని వ్యతిరేకిస్తూ శనివారం నగరంలోని మోకారోడ్డులో ఏఐడీఎస్ఓ నిరసన తెలిపింది. ఈ కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ అఖిల భారత అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌ప్రభుత్వదాడిలో ఇప్పటివరకు 300కుపైబడి విద్యార్థులు అమరులయ్యారన్నారు. ప్రభుత్వం సమస్యను ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించడానికి బదులుగా విద్యార్థులపై దాడి చేయడం హేయమైనచర్య అన్నారు. అన్యాయానికి విరుద్ధంగా విద్యార్థులు అపూర్వమైన పోరాటం చేస్తున్నారన్నారు. బంగ్లాదేశ్ ప్రైమ్ మినిస్టర్ షేక్ హసీనా ఇలాంటి అవాంఛనీయ పరిస్థితులకు పాల్పడడం సరికాదన్నారు. అమరులైన విద్యార్థులకు అన్ని రకాలుగా తమ మద్దతు ఉంటుందన్నారు. నిరసనలో ఏఐడీఎస్ఓ అఖిల భారత అధ్యక్షులు రాజశేఖర్,అశ్విని, రాష్ట్రకార్యదర్శి విజయ్‌కామత్, మనుమంతు, అపూర్వ, చంద్రకళా, సుభాష్, మహంతేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నో పార్కింగ్‌లో వాహనాలకు జరిమానా



రోడ్డుపై నిలిపిన బైకుల గాలి తీసేస్తున్న పోలీసులు

సిరుగుప్ప, జూలై 27 : సిరుగుప్ప పట్టణంలో శనివారం రోడ్లపై నిలిపిన వాహనాలకు జరిమానాలు విధించారు. రాబోయే రోజుల్లో పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలపాలని ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపరాదని సిరుగుప్ప డీఎస్పీ వెంకటేష్ తెలిపారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం వలన ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు.

మంత్రాలయ మఠాధిపతులచే ముద్రాధారణ



ముద్రాధారణలో భక్తులు

బళ్లారి సిటీ, జూలై 27:విజయనగరం జిల్లా హొసపేటలో రాణిపేట శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం మంత్రాలయ మఠాధిపతి శ్రీసుబుధేంద్ర తీర్థ స్వామి ముద్రాధారణ నిర్వహించారు. శనివారం శ్రీవారి మఠానికి చేరుకున్న వందలాది మంది మఠం శిష్యులు, భక్తులకు ముద్రాధారణ నిర్వహించి ఫలమంత్రాక్షతలను అందజేశారు. మఠంవిద్యార్థి అనుసంధాన అధికారి డాక్టర్ వాదిరాజ్ ఆచార్య, డివిజనల్ మేనేజర్ గురురాజ్ దిగ్గవి, మేనేజర్లు గుంజల్లి, కృష్ణమూర్తి, విచారాణాధికారి నరసింహమూర్తి, మఠాధికారుడు భీమసేనాచార్యులు, పవన్‌ఆచార్య, తిరుమలేశ్, దాససాహిత్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనంత పద్మాన తదితరులు పాల్గొన్నారు.

వరదనీటిని పరిశీలించిన అధికారులు

సిరుగుప్ప, జూలై 27 : తుంగభద్ర జలాశయం నుంచి నదికి లక్ష క్యూసెక్కులకు పైగా నీటిని వదిలిన దృశ్యాలను నగరసభ అధికారులు పరిశీలించారు. సామాన్య ప్రజలు అటు వైపు వెళ్లకూడదని దండోరా వేయించారు. వర్షపాతం మరింత పెరిగితే మరిన్ని క్యూసెక్కుల నీరు విడుదల చేసే అవకాశం వుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నగరసభ రెవెన్యూ అధికారులు రాజాబక్షీ, వెంకోబ, మారుతి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పగలు సూర్యకాంతిలో.. రాత్రి దీపకాంతిలో

● కనువిందు చేస్తున్న తుంగభద్ర జలాలు



పగటి వేళ రవి కాంతుల కింద ...



రాత్రివేళ విద్యుత్ వెలుగుల మధ్య...

కంప్లి, జూలై 27 : తుంగభద్ర జలాశయంలో 33 గేట్లు తెరచుకోవడంతో పగలు పర్యాటకులు పూర్తిగా అక్కడున్న నీటిని చూస్తూ ఆనందిస్తున్నారు. గేట్ల ద్వారా వచ్చే నీరు, నీటి ఆవిరి వారికి కనువిందుచేస్తున్నాయి. అలాగే రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులతో పాటు సంగీత గీతాలు వినిపిస్తుండటంతో పూర్తిగా తుంగభద్రడ్యాం సందర్శకులను ఆకట్టుకుంటోంది. గతంలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాత్రమే గేట్ల ద్వారా నదికి నీరు వదిలి విద్యుత్ కాంతులతో, గీతాలతో అలరిస్తూ పర్యాటకులను ఆకట్టుకునేవారు. ఇప్పుడు నదికి నీరు వదిలినప్పటి నుంచి సాయంత్రం వేళల్లో విద్యుత్ దీపాలు వెలిగిస్తూ పూర్తిగా పర్యాటకులను ఆకట్టుకుంటున్నారు. తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడు పర్యాటకులు తుంగా జలాశయ దృశ్యాలను చూడటానికి పోటీపడుతున్నారు.

వర్షానికి కూలిన వృద్ధురాలి ఇల్లు

తోరణగల్లు, జూలై 27: సండూరు తాలుకాలో శుక్రవారం కురిసిన వర్షానికి సోమినహళ్లి గ్రామంలో కట్టె బసమ్మ అనే వృద్ధురాలు నివసిస్తున్న ఇల్లు కూలిపోయింది. అయితే ఎవరికీ ఏ ప్రమాదం జరుగలేదని సంబంధిత అధికారి మంజునాథ్ తెలిపారు. అధికారులు తనకు నూతన గృహాన్ని మంజూరు చేయాలని ఆమె అధికారులను కోరుతున్నారు. కాగా శుక్రవారం సండూరు తాలుకాలో 6.1 మిల్లీమీటర్లు, చోర్నూర్, హబ్లి ప్రాంతంలో 35.0 మిల్లీమీటర్లు అలాగే కురేకుప్ప గ్రామంలో 6.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



వర్షానికి దెబ్బతిన్న ఇంటిని చూపుతున్న బసమ్మ

నగర రోడ్డు విస్తరణకు వినతి



పీడబ్ల్యూడీ ఇంజనీయర్‌కు వినతిపత్రం ఇస్తున్న మేకల ఈశ్వరరెడ్డి

బళ్లారి సిటీ,జూలై 27: నగరంలోని జాతీయ రహదారి 128ని ఇందిరా గాంధీ సర్కిల్ నుంచి (సంగమ్‌సర్కిల్) గోనాల్ బైపాస్ రోడ్డువరకు 80అడుగుల మేర విస్తరించాలని యువసేన సోషియల్ ఆక్షన్ క్లబ్ అధ్యక్షులు మేకల ఈశ్వరరెడ్డి కోరారు. పిడబ్ల్యూడి ముఖ్య ఇంజనీయర్‌కు యువసేన అధ్యక్షులు మేకల ఈశ్వరరెడ్డి శనివారం ఈ మేరకు వినతిపత్రం సమర్పించిన అనంతరం మాట్లాడారు. బళ్లారి నగరం సంగమ్ సర్కిల్ నుండి గోనాల్ బైపాస్ వరకు (రూపనగుడి రోడ్డు) అందరూ ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇళ్లను నిర్మించుకున్నారన్నారు. ఆశ్రయ యోజనలో వారికి స్థలాలు కేటాయించినా వారు స్థలాన్ని ఖాళీ చేయలేదన్నారు. అభివృద్ధికి నగర సుందరీకరణానికి ప్రజలకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలన్నారు.

దంత వైద్యుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భరత్

బళ్లారి రూరల్, జూలై 27: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా బళ్లారి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను శనివారం డెంటల్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ భరత్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్ వివిఎస్ మాట్లాడుతూ గెలుపోటములు సమానమేనని క్రీడాస్ఫూర్తి కలిగి వుండాలన్నారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుండి 58 మంది క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొన్నారన్నారు. ఆదివారం సాయంత్రం బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి చేతుల మీదుగా క్రీడలో గెలుపొందిన వారికి ట్రోఫీలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ డెంటల్ కౌన్సిలింగ్ స్టేట్ మెంబర్ డాక్టర్ శివచరణ్ శెట్టి, రాష్ట్ర జాతీయ మాజీ ఛాంపియన్ డాక్టర్ రాధిక ఆచార్య, స్థానిక డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ భారతి, సీనియర్ డెంటిస్ట్ డాక్టర్ శేషగిరి రావు, డాక్టర్ దివాకర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి డాక్టర్ రాజు, మంజునాథ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పలకు పెరిగిన డిమాండ్



కంప్లి కోట వద్ద తెప్పలను కొనుగోలు చేస్తున్న మత్స్యకారులు

కంప్లి, జూలై 27 : తుంగభద్రనదిలోకి భారీగా నీరు రావడంతో తెప్పలకు భలే డిమాండ్ ఏర్పడింది. కొన్ని గ్రామాల్లోకి కూడా నీరు రావడంతో తెప్పల ద్వారా బయట ప్రపంచంలోకి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే మత్స్యకారులు కూడా తెప్పలద్వారా తమ సేవలు అందిస్తున్నారు. అనంతపురం, కర్నూలు, ముదిగల్లు, బాగల్‌కోటె ప్రాంతాల నుంచి వస్తున్న వారి కారణంగా కంప్లి కోట వద్ద తయారవుతున్న తెప్పలకు డిమాండ్ ఏర్పడింది. గతంలో రూ. 3 వేలు నుంచి రూ. 4 వేలు పలికే తెప్ప ప్రస్తుతం రూ. 6 వేలు నుంచి రూ. 7 వేలు పలుకుతున్నా గ్రామస్తులు కొనుగోలు చేస్తున్నారు.

విద్యార్థులు జ్ఞానశక్తిని గ్రహించాలి

శ్రీకృష్ణదేవరాయవర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో స్వామి నిర్భయానంద సరస్వతి

బళ్లారి సిటీ, జూలై 27: నేటితరం విద్యార్థులు తమ వద్దనున్న అపారమైన జ్ఞానశక్తిని గుర్తిస్తేనే తాము అనుకున్నది సాధించగలరని గదగ్ విజయనగరం జిల్లా రామకృష్ణ వివేకానంద ఆశ్రమ అధ్యక్షులు స్వామి నిర్భయానంద సరస్వతి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీలోని బయలు రంగమందిరం ఆవరణలో శనివారం జరిగిన యూనివర్శిటీ 15వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

విద్యార్థులు బలహీనులు కాదని న్యూనతా భావంతో ఆందోళన చెందుతున్నారన్నారు. దీంతో వారు తమ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారన్నారు. బలమే జీవితం బలహీనతే మరణం అనే స్వామి వివేకానంద సూక్తి ప్రకారం విద్యార్థులు తమ జ్ఞాన శక్తిని గ్రహించాలన్నారు. విద్యార్థులు నిరంతరం విద్యతో నిమగ్నమై ఉన్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, విదేశాలలో భారతదేశ విద్యావ్యవస్థకు ఉన్నత స్థానం ఉందన్నారు. పాశ్చాత్యదేశాలు గుర్తింపులోకి రాకముందు కూడా భారతదేశంలో విద్య ఉన్నత స్థాయిలో ఉండేదన్నారు. యూనివర్శిటీలు ఎలా ఉండాలో ప్రపంచానికి చాటి చెప్పిన దేశం భారత్ అని అన్నారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే పుణ్యక్షేత్రాలు యూనివర్శిటీలని, అక్కడ చదివి ఉన్నత స్థానాలు సాధించిన విద్యార్థులు యూనివర్శిటీలను మరచిపోకూడదన్నారు. విద్యార్థులు గురువును ప్రేమించే లక్షణాన్ని అలవర్చుకోవాలని, దీంతో వారికి సబ్జెక్ట్‌పై చాలా ఆసక్తి పెరుగుతుందన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నిర్భయానంద స్వామి

వీఎస్‌కే యూనివర్శిటీ ఛాన్సలర్ రుద్రేశ్ మాట్లాడుతూ గుల్బర్గా యూనివర్శిటీ నుంచి విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ఆవిర్భవించి నేటికి 14ఏళ్ళు పూర్తిచేసుకుందని, ఈ యూనివర్శిటీ నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్నదన్నారు.

ఈసందర్భంగా కొప్పళ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవి, విజయపూర్ అక్కమదేవి మహిళా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ప్రొఫెసర్ తుసీమాల, కర్ణాటక జానపద విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి బోను రెడీ

కంప్లి, జూలై 27 :ఈ యేడాది పుష్కలంగా వర్షాలు రావడంతో రైతులు పంటలు పండించేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. సండూరు నియోజకవర్గంలోని ఉబ్బలగండి గ్రామం వద్ద పొలాల్లో రైతులు వేసుకున్న మొక్కజొన్న, చెరుకు, శనగలు పంటలను ఎలుగుబంట్లు, అడవిపందులు ధ్వంసం చేస్తుండటంతో రైతులు అటవీ శాఖ అధికారులను శరణు వేడుతున్నారు. సమస్య పైఅధికారులకు తెలియజేయడంతో వారు బోను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ఉబ్బలగండి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన బోను

హోసూరు జోన్

విద్యార్థుల సామర్థ్యానికి గీటురాయి సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను వీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) జూలై 27 : విద్యార్థుల్లోని వైజ్ఞానిక ప్రతిభను బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ మంచి అవకాశమని కృష్ణగిరి జిల్లా కలెక్టర్ సరయు పేర్కొన్నారు. ఊత్తంగరై అదియమాన్ కళాశాల ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఫర్ సైన్స్ ఎగ్జిబిషన్ జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సృజనాత్మకతను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోజూ దినపత్రికలు చదవాలని, వార్తాపత్రిక చదవడం వల్ల మన చుట్టూ ఏం జరుగుతోందో తెలుసుకోవచ్చునన్నారు. భవిష్యత్తులో సైన్స్ ఆధారిత ఉద్యోగాల వాతావరణానికి తగినట్లుగా విద్యార్థులు తమను తాము సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులు చిన్నప్పటి నుంచే మంచి నడవడిక నేర్చుకోవాలన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌ల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలి పారు. అలాగే విద్యార్థులకు అండగా నిలిచిన ఉపాధ్యాయులకు నా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంల్లో అదియమాన్ మహిళా కళాశాల చాన్సలర్ తిరుమల్మురుగన్, ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ అధికారి శివరామన్, కారపట్టు ప్రభుత్వ మోడల్ స్కూల్ హెడ్మాస్టర్ జ్ఞానపడితన్, జిల్లా అభివృద్ధి అధికారులు బాలజీ , హహేశ్‌కుమార్, తవమణి , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూల మార్కెట్‌లో ధరల తగ్గుముఖం

హోసూరు జూలై 27 : హోసూరు పూల మార్కెట్‌లో ఆషాడ మాసం సందర్భంగా గులాబీ పూలకు గిరాకీ పడిపోయింది. పూల మార్కెట్‌లో ఇతర పూల ధరలు కూడా తక్కువగా ఉండడంతో రైతులు నష్టపోతున్నారు. హోసూరు, కెలమంగలం, బాగలూరు, బేరికై, శూలగిరి, డెంకణీకోట, తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యల్లో రైతులు సుమారు 3 వేల ఎకరాల్లో బంతిపూలు, ముల్లై, కనకాంబరం, సంపంగి , చామంతి పూల సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించే పూలను తమిళనాడు , కర్ణాటక రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు విక్రయానికి పంపుతారు. హోసూరు మార్కెట్‌కు ప్రతి రోజు 250 టన్నుల నుంచి 300 టన్నుల పూలు వస్తుంటాయి. ప్రతిరోజు హోసూరు పూల మార్కెట్‌కు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు వచ్చి పూలు కొనుగోలు చేస్తారు. ఆషాడమాసం కావడంతో ఎవరూ రాకపోవడంతో పూల ధర తగ్గింది. గత జూలై నుంచి తెలుగు, కన్నడ ప్రజలకు ఆషాఢమాసం ప్రారంభమయింది. అలాగే జూలై 17 న తమిళలకు ఆడి మాసం ప్రారంభమైంది. ముహూర్తాలు లేక పోవడం వలన కూడా పూల కొనుగోలు తగ్గింది. హోసూరు ప్రాంతంలో గత నెల రోజులుగా వాతావరణం అనుకూలించకపోవడంతో పూల దిగుబడి కూడా తగ్గిందని, దీంతో భారీగా నష్టపోతున్నామని రైతులు తెలిపారు.



సెల్‌ఫోన్ లాక్కున్న దుండగుల అరెస్ట్

హోసూరు(క్రైం) జూలై 27 : బాగలూరు హోసూరు ప్రాంతంలో మొబైల్ ఫోన్ చోరీల పరంపర కొనసాగుతోంది. ప్రజల నుంచి అందిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ తంగదురై ఆదేశాల మేరకు బాగలూరు పోలీసులు నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ పరిస్థితిలో రాజీవ్ గాంధీనగర్‌లో ఒక కార్మికుడిని కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ లాక్కున్న నలుగురు వ్యక్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్ట్ అయినవారిలో బాగలూరు కోట ప్రాంతానికి చెందిన సతీశ్(20), లికిత్ (20) విజయకుమార్(19), బాలుడు(17) ఉన్నారు.

దర్వేష్ కంపెనీ మోసం కేసులో నలుగురి అరెస్టు

రాయచూరు, జూలై 27 : నగరంలో పెద్ద ఎత్తున డిపాజిట్‌లు సేకరించి ప్రజలను మోసగించిన దర్వేష్ కంపెనీ బాధ్యులుగా గుర్తించిన నలుగురు వ్యక్తులను క్రైం బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొంత కాలంగా జిల్లాలో తాలూకాల వారిగా బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకుని అధిక వడ్డీ ఆశతో పెద్ద ఎత్తున డిపాజిట్‌లు స్వీకరించిన దర్వేష్ కంపెనీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దుమారం చెలరేగుతున్న నేపథ్యంలో ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విభాగానికి అప్పగించింది. అంతకు పూర్వం స్థానికంగా డిపాజిట్ సొమ్మును కోల్పోయిన బాధితులు చేసిన ఆందోళనల ఆధారంగా మార్కెట్ యార్డ్ పోలీసులు కేసు నమోదు చేయగా కేసు విచారణను క్రైం బ్రాంచ్ పోలీసులు చేపట్టారు. క్రైం బ్రాంచ్ పోలీసు విచారణలో గుర్తించిన నలుగురు నిందితులను శనివారం సీఐడీ అధికారుల వద్ద హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ నలుగురిని బబ్లు, సయ్యద్ వసీం, సయ్యద్ మిస్కిన్, ఫారుక్‌లుగా గుర్తించారు. కాగా సీఐడీ అధికారుల బృందం ఇప్పటికే నగరంలోని పలు చోట్ల తమదైన పద్ధతిలో విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సీఐడీ ఎస్పీ పురుషోత్తమ్ నేతృత్వంలోని అధికారుల బృందం డిపాజిట్‌లు చేసిన వివరాలతో పాటు వారు డిపాజిట్ చేసిన సందర్భంగా పొందిన రసీదు, మెచ్యూరిటీ అమౌంట్ కోసం ఇచ్చిన గ్యారెంటీ రసీదులు(అగ్రిమెంట్ బాండ్) ఇతరత్రా అన్ని వివరాలను సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. అసలు సూత్రధారిగా ఉన్న మహ్మద్ సుజా ఇప్పటికే తప్పించుకుని పారిపోగా ఆయన కోసం డిల్లీ, ఇండోర్ తదితర చోట్ల ముమ్మర దర్యాప్తు ప్రారంభించారు. దర్వేష్ కంపెనీకి కీలక సూత్రధారిగా ఉన్న మహ్మద్ సుజాను పట్టుకునేందుకు సీఐడీ పోలీసుల బృందం ముంబైకి వెళ్లినట్లు తెలిసింది.



పోలీసులకు పట్టుబడిన నిందితులు వీరే...

పచ్చదనంతోనే పర్యావరణానికి రక్షణ

రాయచూరు, జూలై 27 : పర్యావరణ రక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించాలని యరగేరా ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ సత్యనారాయణ సూచించారు. పర్యావరణ పరిరక్షణ పచ్చదనంతోనే సాధ్యమని ఇందుకోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. శనివారం తాలూకాలోని యరగేరా ఉన్నత పాఠశాలలో ఈకో-క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి మొక్కలు నాటిన హెడ్‌మాస్టర్ సత్యనారాయణ, మొక్కలు నాటడం వల్ల లభించే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సునితా, గిరీశ్ ఎం, అవినాశ్, అందానయ్య, కే శారదా తదితరులు పాల్గొన్నారు.



మొక్కలకు నీరుపోస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కాసు బ్రహ్మానందరెడ్డి (జయంతి)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాసు బ్రహ్మానందరెడ్డి 1909 జూలై 28న గుంటూరు జిల్లా నరసారావుపేట ప్రాంతంలో జన్మించారు. మహాత్మాగాంధీ పిలుపుతో సత్యాగ్రహ, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించారు. కేంద్ర, రాష్ట్రాలలో మంత్రి పదవులతో పాటు అనేక పార్టీ పదవులను నిర్వహించారు. బహుళార్థ సాధకప్రాజెక్టు నాగార్జున సాగర్ ప్రాజెక్టు, తుంగభద్ర డ్యామ్, పోచంపాడు ప్రాజెక్టుల ఏర్పాటు, సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణమధ్య రైల్వే ఏర్పాటు కావడంలో కీలకంగా వ్యవహరించారు. ఎన్నో సంక్షేమాలు అమలు చేశారు. 1994 మే 20న కన్నుమూశారు.

జైపాల్‌రెడ్డి (వర్ధంతి)



ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన సూదిని జైపాల్ రెడ్డి 1942 జనవరి 16న జన్మించారు. లోక్‌సభ సభ్యుడిగా ఐదు సార్లు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత. కల్వకుర్తి ఎమ్మెల్యేగా, చేవెళ్ల ఎంపీగాను గెలుపొందారు. కేంద్ర సమాచార శాఖ, ప్రసార మంత్రిగా, ఎర్త్ సైన్స్ మంత్రి, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగాను తదితర శాఖలను నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడిగాను కొనసాగారు. చట్టసభలలో ఆయన ప్రసంగాలు ఎంతో కీలకంగా ఉండేవి. 1998లో అత్యుత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నుకోబడ్డారు. 2019 జూలై 28న కన్నుమూశారు.

రావి కొండలరావు (వర్ధంతి)



ప్రముఖ నటుడు రావి కొండలరావు 1932 ఫిబ్రవరి 11న సామర్లకోటలో జన్మించారు. నటుడు, దర్శకుడు, రచయిత, పాత్రికేయుడు, నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సుమారు 600 సినిమాలలో నటించారు. సినిమా రచనలే కాకుండా ఆంధ్ర జ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఉదయం తదితర దిన, వార, మాసపత్రికలలో ఆయన రచనలు ప్రచురితమయ్యాయి. 'సుకుమార్' కలంపేరిట కొన్ని రచనలు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళా ప్రపూర్ణ'తో గౌరవించింది. జీవితసాఫల్య పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2020 జూలై 28న కన్నుమూశారు.

ధనుష్ (పుట్టినరోజు)



తమిళ సినీ నటుడు ధనుష్ 1983 జూలై 28న చెన్నైలో జన్మించారు. అసలు పేరు వెంకటేశ్ ప్రభు కస్తూరి రాజా. నటుడు, నిర్మాత, దర్శకుడు, రచయిత, గేయ రచయిత, నేపథ్య గాయకుడిగా రాణించారు. తమిళంతోపాటు తెలుగులోనూ ఆయన సినిమాలు హిట్ అయ్యాయి. 13 సైమా అవార్డులు, 9 విజయ్, 4 నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ ఇతర పురస్కారాలు అందుకున్నారు. 'వై దిస్ కొలవెరి డి' అనే పాట యూ ట్యూబ్‌లో 100 మిలియన్ వ్యూస్ అందుకున్న తొలి ఇండియన్ మ్యూజిక్ వీడియో కావడం విశేషం. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ అల్లుడు.

హారీ కేన్ (పుట్టినరోజు)



హారీ ఎడ్వర్డ్ కేన్ 1993 జూలై 28న లండన్‌లోని వాల్తామ్‌స్టో ప్రాంతంలో జన్మించారు. ఇంగ్లండ్ దేశ ఫుట్‌బాల్ జాతీయ జట్టు కెప్టెన్. ప్రీమియర్ లీగ్ క్లబ్‌కు స్ట్రైకర్‌లో ఉన్నారు. ప్రపంచంలో ఉత్తమ స్ట్రైకర్‌గా పేరొందారు. ఇంత వరకు 350కుపైగా గోల్స్ సాధించారు. ఫస్ట్ ఫుల్ సీజన్‌లో 31 గోల్స్ సాధించి రికార్డు నెలకొల్పారు. 2018 ఫిఫా వరల్డ్‌కప్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. 'మెంబర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్' హోదా సాధించారు. పలు గౌరవాలు అందుకున్నారు. 2022లో హారికేన్ ఫౌండేషన్ నెలకొల్పారు. చింగ్‌ఫోర్డ్‌లో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు.

దుల్కర్ సల్మాన్ (పుట్టినరోజు)



ప్రముఖ మళయాళ నటుడు మమ్ముట్టి కుమారుడు దుల్కర్ సల్మాన్ 1986 జూలై 28న కొచ్చిలో జన్మించారు. 2012లో సెకండ్ షో అనే మళయాళ సినిమాతో తెరంగేట్రం చేశారు. మళయాళ, తమిళ భాషల సినిమాల్లో పేరొందారు. తెలుగులోనూ గుర్తింపు సాధించారు. మహానటి, సీతారామం సినిమాలు హిట్ అయ్యాయి. ఉత్తమ నటుడుతోపాటు ఫిలింఫేర్ అవార్డులు పొందారు.

ఖాద్రీశుడిని దర్శించుకున్న ఏడీజే



ఏడీజేకి ఖాద్రీశుడి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

కదిరిలీగల్, జూలై 27: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కదిరిలో వెలసిన నరసింహ స్వామిని జిల్లా అడిషన్ కోర్టు న్యాయాధికారి సత్యవాణి శనివారం దర్శించుకున్నారు. ఏడీజే వెంట స్థానిక న్యాయాధికారులు ఎస్ ప్రతిమ, పీ మీనాక్షి సుందరి ఇతర సిబ్బంది ఆలయానికి వచ్చారు. వారికి తూర్పు రాజగోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయాధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ విశిష్టత వివరించారు. ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన వైదేహీ ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీజేను స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి సన్మానించారు. స్థానిక కోర్టుల తనిఖీల్లో భాగంగా కదిరికి వచ్చినట్లు ఏడీజే పేర్కొన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కను నాటారు.

సువర్ణ కన్నడజ్యోతి రథయాత్రకు ఘనస్వాగతం



ఊరేగింపులో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, తహసీల్దార్ తదితరులు

బాగేపల్లి, జూలై 27: సువర్ణ కన్నడజ్యోతి రథయాత్ర చిక్కబళ్లాపుర జిల్లా గుడిబండ తాలూకా మీదుగా బాగేపల్లి సరిహద్దుకు చేరుకోవడంతో ఘనస్వాగతం పలికారు. కన్నడ సంస్కృతిశాఖ, జిల్లా కసాప, తాలూకా పాలనాయంత్రాంగం, కన్నడ సంఘాలు, కన్నడ అభిమానులు పాల్గొన్నారు. పట్టణంలోని జేఎంఎఫ్‌సి కోర్టు సమీపాన రథయాత్ర చేరుకోగా ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి, తహసీల్దార్ మనీషా మహేశ్‌పత్రిలు కన్నడమాత భువనేశ్వరి దేవికి పూలహార వేసి కన్నడ పతాకంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాతృభాష కన్నడ మనుగడ మనందరి బాధ్యత అన్నారు. కన్నడ సుందరమైన భాషగా పేర్కొన్నారు. కన్నడ భాషకు 2వేల సంవత్సరాల చరిత్ర ఉందని యువతకు భాష గొప్పదనం చాటాలన్నారు. కన్నడ భాష, నేల, సరిహద్దు, నీరు విషయాలపై అవగాహన కల్పిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కన్నడరథయాత్ర కొనసాగుతోందన్నారు. ఇతర భాషలవారిని గౌరవిస్తూనే వారికి కన్నడభాషపట్ల ఆసక్తి కల్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆశా కార్యకర్తలు పూర్ణకుంభ కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. పట్టణంలోని డీవీజీ రోడ్డు నుంచి ప్రధానరహదారి మీదుగా నేషనల్ కళాశాల వద్దకు చేరుకుంది. వివిధ కళాబృందాలు సందడి చేశాయి. కార్యక్రమంలో ఈఓ రమేశ్‌రెడ్డి, తాలూకా ఆరోగ్య అధికారులు సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ లక్ష్మి, పురసభ ముఖ్యాధికారి శ్రీనివాస్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వన్యజీవి మండలి సభ్యులుగా ధ్రువ, వైశాలి

బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వన్యజీవి మండలి సభ్యులుగా ప్రముఖ కాంగ్రెస్ నాయకులు వారసులు ఇద్దరికి చోటు కల్పించారు. మూడేళ్ల వ్యవధికిగాను సమితిని ఏర్పాటు చేశారు. నిపుణులు, పర్యావరణ ప్రేమికుల కోటాలో రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ కుమారుడు ధ్రువ ఎం పాటిల్, ధారవాడ ఎమ్మెల్యే వినయ కులకర్ణి కుమార్తె వైశాలి కులకర్ణిలను సభ్యులుగా నియమించారు. వన్యజీవి మండలికి అధ్యక్షులుగా ముఖ్యమంత్రి, ఉపాధ్యక్షులుగా అటవీశాఖ మంత్రి ఉంటారు. శాసనసభ్యుల కోటాలో చీఫ్ విప్ అశోక్ పట్టణ, గుండ్లుపేట ఎమ్మెల్యే గణేశ్ ప్రసాద్, ఎమ్మెల్సీ పుట్టణ్ణ, ప్రభుత్వేతర సంస్థల కోటలో వైల్డ్ లైఫ్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా సుశీల్‌గ్యాన్‌చంద్, టైగర్స్ అన్ లిమిటెడ్ వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధి సీమాబేగం ఖలీద్, బెంగళూరు పర్యావరణ ట్రస్టు ముఖ్యులు ఆర్‌వీ దినేశ్‌లను నియమించారు. జీవశాస్త్ర నిపుణులు రవీంద్ర రఘునాథ్, చిక్కణ్ణ, ఎస్టీ కోటాలో డాక్టర్ రాజ్‌కుమార్ ఎస్ అల్లెతోపాటు సంకేత్ పూవయ్య, వైశాలి కులకర్ణి, అజిత్ కరిగుడ్డయ్య, వినయ్‌కుమార్ మాళిగ, డాక్టర్ సంతృప్త్, ధ్రువ్ ఎం పాటిల్, మల్లప్ప ఎస్ అంగడిలను నియమించారు. వన్యజీవి మండలిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ శాఖలు, సంస్థల అధికారులు సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర వన్యజీవి విభాగం తరపున అటవీశాఖ ముఖ్యఅధికారి సభ్యులుగా ఉంటారు.

అక్టోబరులో 'నేషనల్ టాలెంట్ హంట్'

బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అక్టోబరు 19 నుంచి ఆకాశ్ నేషనల్ టాలెంట్‌హంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు సంస్థ సీఎండీ దీపక్ మెహ్రోత్రా ప్రకటించారు. టాలెంట్ ఎగ్జామ్ ఆరంభించి 15ఏళ్లు పూర్తయ్యిందన్నారు. 7నుంచి 12 తరగతుల విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. అర్హులైన విద్యార్థులకు వందశాతం విద్యార్థి వేతనాలు ఇస్తామన్నారు. ఆకాశ్‌లో చదివి జేఇఇ అడ్వాన్స్‌లో 25వర్యాంకు సాధించిన రిషిశేఖర్ శుక్లా, కృష్ణసాయి శిశిర్‌తోపాటు పలువురిని సత్కరించారు. టాలెంట్‌హంట్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో జరుగుతుందని ఉత్తమ మార్కులు సాధించిన టాప్ 100మందికి స్కాలర్‌షిప్‌తోపాటు నగదు బహుమతి ఇస్తారన్నారు. 315కుపైగా కేంద్రాలలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఆగస్టు 15వరకు పేర్ల నమోదుకు వీలుందన్నారు.



మీడియా సమావేశంలో ఆకాశ్ సంస్థ ప్రతినిధులు



పిల్లల సంతలో నిర్వాహకులు

సంతతో విద్యార్థులలో వ్యవహారం జ్ఞానం

బాగేపల్లి, జూలై 27: పిల్లల్లో వ్యవహారం జ్ఞానాన్ని పెంపొందించేందుకు మక్కళసంత దోహదపడుతుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని న్యూహారిజన్ పాఠశాల ఆవరణలో శనివారం పిల్లలకోసం సంత నిర్వహించారు. 150కుపైగా విద్యార్థులు పాల్గొని వ్యాపార లావాదేవీలు నిర్వహించారు. నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పూలు, పండ్లు, పాలు, దుస్తులు, తినుబండారాలు ఇతరత్రా వస్తువులు విక్రయించారు. ఫ్యాషన్ ఆభరణాలతో పాటు బేల్‌పూరి, బోండా, బజ్జి, కాఫీ, టీ, మసాలా బొరుగులు, పానీయాలు అమ్మారు. పాఠశా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో పాఠాలకే పరిమితం కాకుండా వ్యవహారజ్ఞానం పెంపొందించేందుకే వారిచేతనే సంత నిర్వహించామన్నారు. వ్యాపార లావాదేవీలు, ఇతరత్రా అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. పాఠశాల కార్యదర్శి పృథ్విరాజ్ మాట్లాడుతూ వ్యాపారదక్షత గురించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. రిటైర్డు గ్రేడ్ 2 తహసీల్దార్ మునిరామయ్య, రామకృష్ణ, తన్విరెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవ అభినందనీయం

బంగారపేట, జూలై 27: చదివిన పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేసిన సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కీలుకొప్ప శనేశ్వర కన్నడ ప్రాథమికోన్నత ఎయిడెడ్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబీకులు కలసి 1-7వ తరగతి వరకు విద్యార్థులందరికీ షూ, సాక్స్, బెల్ట్, టై అందచేశారు. దాత హరిప్రసాద్‌రావ్ మాట్లాడుతూ విద్యార్థులు గురువులు, పెద్దలను గౌరవించి ప్రయోజకులు కావాలన్నారు. పూర్వ విద్యార్థి రఘునాథ్‌సింగ్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాతలు దీపాసింగ్, సుమిత్రబాయి, మంజునాథ్‌సింగ్, సోమశేఖర్, గణేశ్, గిరిజమ్మ, ఉషారాణి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

షూ, సాక్స్‌లతో విద్యార్థులు



కన్నడ జ్యోతి రథం స్వాగతానికి సన్నాహాలు



సమావేశంలో తహసీల్దార్ స్వామి తదితరులు

శిడ్లఘట్ట, జూలై 27: కర్ణాటక నామకరణం 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా 'కర్ణాటక ఉసిరాగలి' అనే నినాదంతో కన్నడజ్యోతి రథయాత్ర సాగుతున్న తరుణంలో ఈనెల 29న విచ్చేయనున్న రథానికి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ బి.ఎన్.స్వామి వెల్లడించారు. తాలూకాలోని శక్తికేంద్రంలో వివిధశాఖల అధికారులు, సంఘ సంస్థల ప్రముఖులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డెంగీ ప్రబలకుండా ఆరోగ్యశాఖ అధికారులకు సూచనలు చేశామన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి, నగరసభ మంజునాథ్, గ్రేడ్2 తహసీల్దార్ పూర్ణిమా, ఆరోగ్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల వేషధారణ

చేళూరు, జూలై 27: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు కన్నడ సంస్కృతి కార్యక్రమాలను శనివారం అర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. బాగేపల్లి రోడ్డు, చింతా మణిరోడ్డు మార్గాలలో ఊరేగింపు సాగింది. అన్ని పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



వేషధారణలో కళాకారుల బృందం

బాలికలను వేధించిన వ్యక్తి అరెస్ట్

గార్లదిన్నె, జూలై 27: హాస్టల్‌లో ఉంటున్న బాలికలను లైంగికంగా వేధించిన మౌలా నూర్‌బాషాను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మండల కేంద్రం లోని స్థానిక రైల్వేగేటు సమీపంలో మిస్ప్రోగ్రేస్ హోప్ (క్రిస్టియన్) పేరుతో పాస్టర్ మౌలా సయ్యద్‌వలి ఎలాంటి అనుమతులు లేకుండా బాలికల హాస్టల్ నిర్వహిస్తున్నాడు. ఈయన కుమారుడు మౌలా నూర్‌బాషా హాస్టల్‌లో ఉన్న బాలికలను లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని బాలికలు తమ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు హాస్టల్ వద్దకు చేరుకుని నిర్వాహకుడి కుటుంబ సభ్యులకు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు చేసిన విషయం విదితమే. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థినులకు ఎక్కడైన హాస్టల్‌లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. కాగా అనుమతులు లేకుండా బాలికల హాస్టల్‌ను నిర్వహిస్తున్న మౌలా సయ్యాద్‌వలిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సమష్టిగా బెంగళూరును అభివృద్ధి చేద్దాం : డీసీఎం

బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సమగ్ర అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దామని నగరాభివృద్ధిశాఖ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. శనివారం విధానసౌధలో బెంగళూరు నగర పరిధిలోని మంత్రులు, అన్ని పార్టీల ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతిపక్షనేత అశోక్, మంత్రి జమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో రాజకీయం చేద్దామని, ప్రగతి కోసం భాగస్వామ్యులు అవుదామని పిలుపునిచ్చారు. గ్రేటర్ బెంగళూరు అంటే ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. బెంగళూరు భవిష్యత్ కోసం అందరి సలహా, సూచనలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతిపక్షనేత అశోక్ బెంగళూరు అభివృద్ధి కమిటీలో అశ్వత్థనారాయణ పేరును సూచించారన్నారు. కెంపేగౌడ బెంగళూరును నిర్మించారని, ఎస్ఎం కృష్ణ ప్రపంచస్థాయిలో పేరొందేలా చేశారని వివరించారు. సాంకేతికం, మానవ వనరులు, వాతావరణం, సంస్కృతిని చూసి ఇక్కడికి వచ్చేవారు వెనుతిరగడం లేదన్నారు. నగరంలో శాశ్వతమైన అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. లాల్‌బాగ్, కబ్బన్‌పార్క్‌ల కాలం ముగిసిందని, పిల్లలు నెహ్రూ ప్లానెటోరియం చూడవచ్చునని వీటిని మించి పర్యాటకులను ఆకట్టుకునే కేంద్రం లేదని అందుకే స్కైడెక్ నిర్మించదలిచామని, నగర పరిధిలోని నైస్ రోడ్డు సమీపాన 250 మీటర్ల స్కైడెక్ నిర్మిస్తామని అన్నారు. స్కైడెక్ ద్వారా ప్రత్యేక ఆకర్షణ కానుందన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు హెబ్బాళ ఎస్టీమ్‌మాల్ నుంచి సిల్క్‌బోర్డు దాకా 18.5 కిలోమీటర్ల మేర సొరంగ మార్గాన్ని నిర్మిస్తామన్నారు. ఆగస్టు 20వ తేదీ నాటికి కావేరి ఐదో విడత నీటి విడుదల చేస్తామన్నారు. రాగిగుడ్డ వద్ద డబుల్‌డెక్కర్ ఫ్లై ఓవర్ ప్రత్యేకంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, ఎమ్మెల్యేలు మునిరత్న, గోపాలయ్య, రవిసుబ్రహ్మణ్య, కృష్ణప్ప, విశ్వనాథ్, మునిరాజ్, రామమూర్తి, మంజుల, బైరతి బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రతిపక్షనేత అశోక్ తదితరులు

ఊరందరికీ మోసం

రూ. 5 కోట్ల లూటీ

- పోలీస్‌స్టేషన్ చుట్టూ కల్లూరు గ్రామస్థులు

బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా గుబ్బి తాలూకాలోని కల్లూరులో ఊరందరికీ మోసం జరిగింది. సుమారు 5 కోట్ల రూపాయలదాకా గ్రామస్థులు మోసపోయారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే సామాన్యులు సొమ్ము కోల్పోయారు. బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి కల్లూరు ప్రజలకు డేటా మీర్ ఏఐ యాప్ సాయంతో ఆరంభమయ్యే ఆర్థికమైన యాప్ మోస చేశారు. 500మందికిపైగా గ్రామస్థులు మోసపోయారు. వీరిలో కూలి కార్మికులు, రైతులు, మహిళలు ఉన్నారు. రూ.300 నుంచి రూ.3లక్షల దాకా మోసపోయారు. యాప్ ద్వారా డిపాజిట్ చేస్తే తొందరగా డబుల్ అవుతుందని నమ్మించారు. ఆరంభంలో కొందరికి రెట్టింపు సొమ్ము ఇచ్చారు. రెండు నెలలపాటు సజావుగా సాగగా మూడో నెలనుంచి సొమ్ము రావడం నిలిచిపోయింది. గురువారం నుంచి యాప్ కూడా పని చేయలేదు. దీంతో సొమ్ము జమ చేసినవారు తమ డిపాజిట్లపై ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సి.ఎస్.పుర పోలీస్‌స్టేషన్ ఎదుట గ్రామస్థులంతా చేరి ఫిర్యాదు చేశారు. డీఎస్పీ చంద్రశేఖర్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. బాధితుల సమస్యను ఆలకించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆన్‌లైన్ దందాలో పలువురు మోసపోయారని, ప్రజల ఫిర్యాదులపై దర్యాప్తు సాగుతోందన్నారు. గ్రామానికి చెందిన కల్లేశ్, యోగీశ్, మంజునాథ్, పరప్ప, నాగరాజు తదితరులు మాట్లాడుతూ తమకు న్యాయం లభిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

నేటి నుంచి గంధం, ఉరుసు

శిడ్లఘట్ట, జూలై 27: పట్టణంలోని దిబ్బూరహళ్లి రోడ్డులోగల హజరత్ ఖ్వాజా షా అబ్దుల్ కరీంవుల్లా షా అలియాస్ హజరత్ అమీర్‌బాబా 49వ గంధం, ఉరుసు ఉత్సవాలు ఆది, సోమవారాలలో ఉంటాయని దర్గా ట్రస్టు కార్యదర్శి రహమత్ అలి వెల్లడించారు. పట్టణంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంప్రదాయంగా పట్టణంలోని హాజి అలిమియా ఇంటి నుంచి గంధం ఊరేగింపు పురవీధులలో సాగి దర్గాకు చేరుకుంటుందన్నారు. సోమవారం ఉరుసు కార్యక్రమం ఉంటుందన్నారు.

మాస్టర్‌పీస్ ఆభరణాల మేళా



ఆభరణాల మేళా ప్రారంభంలో నటి నందితా శ్వేతా తదితరులు

బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేవారు ప్రత్యేక డిజైన్‌లు, మాస్టర్ పీస్‌ల పట్ల ఆసక్తి చూపుతుండడంతో హై లైఫ్ జ్యువెల్స్ ప్రత్యేక మేళా ఏర్పాటు చేసింది. సంస్థ ఆధ్వర్యంలో వందకుపైగా బ్రాండ్‌లు ప్రసిద్ధ ఆభరణాల కంపెనీలు భాగస్వామ్యులయ్యాయి. శుక్రవారం ప్రారంభమైన మేళా ఆదివారంతో ముగియనుందని, ప్రదర్శనల ఎండీ సీఈఓ అభి పి డొమ్నిక్ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి ఫ్యాషన్‌లు, జీవనశైలి అనుభవాలకు ఇదో వేదిక అయ్యిందన్నారు. శ్రీలంక, థాయ్‌ల్యాండ్, దుబాయ్, దక్షిణాఫ్రికా దేశాలనుంచి కూడా సంస్థలు భాగస్వామ్యులైనట్టు తెలిపారు. ప్రముఖ నటి నందితా శ్వేతా మేళాను ప్రారంభించారు.

తేలికపాటి జల్లులు

పుట్టపర్తి రూరల్, జూలై 27: జిల్లాలో శుక్రవారం రాత్రి అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు. మడకశిరలో అత్యధికంగా 7.2 మిమీ, తాడిమర్రిలో అత్యల్పంగా 1.4 మిమీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. అలాగే గుడిబండలో 5.8 మి.మీ., ఓబుళదేవరచెరువు 5.4, బత్తలపల్లి 4.4, నంబులపూల కుంట 4.4, నల్లమాడ 4.4, రొళ్ల 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గాండ్లపెంటలో 3.8 మి.మీ., ముదిగుబ్బ 3.2, నల్లచెరువు 3.0, తలుపుల 2.4, కదిరి 2.4, కొత్తచెరువు 2.2, తాడిమర్రి 1.8 మి.మీ. అత్యల్ప వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

అనంతపురం టౌన్, జూలై 27: డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఆదివారంనుంచి జరుగుతాయని కలెక్టరు వినోద్‌కుమార్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఇందుకోసం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 10గంటల నుంచి 12వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5వరకు జరుగుతాయన్నారు. థియరీ టైపు పరీక్షలు ఉదయం 10 గంటలనుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు ఉంటాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు 15 నిమిషాలు ముందే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. పెన్సిల్, హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా కార్డు తీసుకొని హాజరుకావాలన్నారు.